

# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



## 92 పదునైదవ అధ్యాయము - పురుషోత్తమప్రాప్తియోగము

**21.** త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః
కామః క్రోధస్తథా లోభస్తస్మా దేతత్త్రయం త్యజేత్

**వ్యాఖ్య :** - నరకప్రాప్తికి హేతుభూతమైన దుష్టత్రయ మీ శ్లోకమున తెలియజేయబడినది. ఆ మూడును (కామాదులు) నరకమునకు ద్వారములవంటివేయని చెప్పబడినది. అనగా అవి కలవారికి నరకద్వారము తెఱవబడినట్లేయని అర్థము. ఆ మూడు దుర్గుణములు లేనివారికి ఆ ద్వారములు మూయబడియుండుట వలన, ఇక వారికి నరకప్రవేశము లేనేలేదని యర్థము. ఇంతదనుక భగవానుడు అనేక అసుర గుణములు చెప్పుచువచ్చెను. అట్టి దుర్గుణములు కలవారు క్రింది క్రింది లోకములకు, నీచనీచ జన్మలకు జనుచు నానా దుఃఖపరంపరలను అనుభవించుచుందురనియు తెలిపెను. అయితే ఇక వారిగతి అంతియేనా? వారుద్ధరింపబడుటకిక అవకాశములు లేవా? అని ప్రశ్నించిన, కలవని గీతాచార్యులు చెప్పుచున్నారు. అసురగుణములన్నిటని మూడుగ విభజింపవచ్చును. అవియే (1) కామము (2) క్రోధము (3) లోభము. కాబట్టి ఏవడీ మూడింటిని ప్రయత్నపూర్వకముగ త్యజించివేయునో అతడు నరకము యొక్క బెడదనుండి తప్పించుకొని ఊర్ధ్వగతిని బడయగలడు. ఈ సత్యమింకను రాబోవు శ్లోకమున చక్కగా విశదీకరింపబడగలదు. కాబట్టి ఇక పాపాత్ములెవరును తమ యధఃపతనమును గూర్చి దిగులుపడక, తామెచ్చోటనున్నారో అచటి నుండియే భగవానుడు తెలిపిన ఈ కామక్రోధ లోభ త్యాగరూపప్రయత్న మాచరించుచు ఉండినచో అచిరకాలములోనే వారు నరకవిముక్తులై, దుఃఖవర్జితులై పరమశ్రేయము నొందగలరు. కావున ప్రతివారును వారివారి హృదయములను చక్కగ పరిశోధించుకొని ఈ కామ, క్రోధ, లోభములను ముగ్గురు దొంగలను కనిపెట్టి వివేకాదుల సహాయమున వారిని దూరముగ తరుమగొట్ట వలెను.

ఈ శ్లోకమున 'త్రివిధమ్' అను పదమును 'నరకమ్' అనుదానికిగాక, 'ఇదమ్' అను పదమునకు విశేషణముగ జెప్పి, (కామ, క్రోధ, లోభములను) మూడువిధములుగనున్న ఆసురీసంపద 'నరకద్వారము' అనియు అర్థము చెప్పవచ్చును.

**22. ఏతైర్విముక్తః కౌన్తేయ! తమోద్వారై స్త్రి భిర్నరః**
**ఆచరత్యాత్మన శ్శ్రేయ స్తతో యాతి పరాం గతిమ్.**

**వ్యాఖ్య :-** కామ, క్రోధ, లోభములను ఈ మూడు దుష్టగుణము లున్నంతవఱకును ఎవడును వృద్ధికి రాలేడు. హితమును బొందలేడు. తనకు మేలొనర్చుకొనలేడు. అందుచేత మొట్టమొదట వానిని తొలగించివేయవలెననియు, అపుడు మాత్రమే మానవుడు తనకు శ్రేయము నొనగూర్చుకొని సర్వోత్తమమగు మోక్షపదవిని బడయగలడనియు భగవాను డిచట బోధించుచున్నారు. సూర్యచంద్రులు రాహువు నుండి విడువబడినట్లున్ను, గజేంద్రుడు మొసలి బారి నుండి విడుదలబొందినట్లును, బంధితుడు కారాగృహము నుండి విముక్తుడైనట్లును జీవుడీ దుష్టత్రయము యొక్క బంధము నుండి విడుదలను బొందవలెను. 'ముక్తః' అని చెప్పక 'విముక్తః' అని చెప్పుట వలన వాని నుండి పూర్తిగ విడుదల జెందవలెనని, వాని జాడ ఏమాత్రము హృదయకోశమున నుండరాదని భావము. మఱియు అవి 'తమోద్వారము' లని పేర్కొనబడుటవలన, ఆ కామాదులు అజ్ఞానరూపములే యనియు, అంధకారబంధురములనియు, ప్రకాశా భావరూపము లనియు, నరకహేతువులనియు స్పష్టమగుచున్నది. అవి తమోద్వారాము లగుటచే, అవి కలవాడు 'చీకటి యింటి'లో కాపురము పెట్టిన చందముననే యుండును. అనగా దుఃఖములనే యనుభవించును.

'ఆచరత్యాత్మనః శ్రేయః'- ఆ కామాదులున్నంత వఱకు ఎవరును తనకు శ్రేయమును గలుగజేసికొనజాలరు. ఆత్మోద్ధరణము గావించుకొనజాలరు. తానెవరు? జగత్తేమి? అని విచారింపజాలరు. అనగా వాసనాక్షయము కానంతవఱకు ఆత్మజ్ఞానము పూర్ణముగ ఉదయించనేరదనియు, ఆత్మానుభూతి లెస్సగ కలుగదనియు అర్థము. కామాదులు వదలిపోయినపుడే అట్టి జ్ఞానము బాగుగ సంప్రాప్తము కాగలదని ఈ శ్లోకము ద్వారా తెలియుచున్నది. కాబట్టి సాధకుడు ప్రప్రథమున ఆ దుష్టత్రయమును పారద్రోలవలెను.

'పరాంగతిమ్'- అని చెప్పుటచే మోక్షము అన్ని పదములకంటెను, అన్ని గతులకంటెను సర్వోత్కృష్టమైనదని తెలియుచున్నది. మఱియు కామాదులున్న స్థితి అత్యంత నికృష్టమైన దనియు దీనివలన ధ్వనించుచున్నది.

**23. యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః**
**న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్**

**వ్యాఖ్య :-** వారివారి యిష్టమువచ్చినట్లు ఆచరించుటయనునది (స్వేచ్ఛాప్రవర్తన) ఈ శ్లోకమున ఖండింపబడినది. ఒక్కొక్కరు వారివారికి తోచిన పద్ధతిననుసరించుచు అదియే సరియైనదని వాదించుట పొరపాటు. ఒకరు చేయు అనుష్ఠానము సరియైనదా కాదా యని పరీక్షించుటకు శాస్త్ర ప్రమాణము ఆవశ్యకమై యున్నది. వారివారి యనుభవములు శాస్త్రప్రమాణము ననుసరించియున్నావా? యని పరీక్షించుకొనుచుండవలెను. అద్దానికి తన యనుభవము సరిపోయినచో అపుడు తనది సరియైన మార్గమని, సిద్ధాంతమని నిర్ణయించుకొనవచ్చును. శాస్త్రవాక్యములు అనుభవజ్ఞులగు మహర్షుల యొక్క నిర్ణయములుగనుకను, భగవదాశయములే గనుకను, వానినెవరును ఉల్లంఘింపరాదు. కనుకనే వాని నుల్లఘించి వర్తించువారు మోక్షమును బడయలేరని, సుఖమును పొంద జాలరని శ్రీకృష్ణమూర్తి ఇచట ఆనతిచ్చుచున్నారు. కాబట్టి విజ్ఞులెల్లరు శాస్త్రాదేశము ననుసరించియే ప్రవర్తించవలెను. దీనిని బట్టి సుఖమునుగాని, మోక్షమునుగాని వాంఛించువాడు శాస్త్రోక్తవిధి ప్రకారము చక్కగ అనుష్ఠానమును శీలించవలెనని తెలియుచున్నది.

**24. తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితః**
**జ్ఞాత్వా శాస్త్ర విధానో క్తం కర్మ కర్తుమిహార్హసి.**

**వ్యాఖ్య :-** ఏ కార్యమును చేయవలెను? ఏ కార్యమును చేయరాదు? అను వితర్కము కలిగినపుడు శాస్త్రమే యిట ప్రమాణమైయున్నది. దాని ననుసరించియే వర్తించవలెనని భగవానుడిచట బోధించుచున్నారు. 'తస్మాత్' అనగా, పూర్వశ్లోకము నందు చెప్పబడిన రీతిగా శాస్త్రవిరుద్ధముగ నాచరించినచో సుఖముగాని, మోక్షముగాని గలుగదు. కాబట్టి- ఈ వాక్యమువలన భగవదృష్టి యందు వేదశాస్త్రము లెంతటి పరమ ప్రమాణములో విదితమగుచున్నది. మఱియు అవి గొప్ప ప్రమాణములని సాక్షాత్ భగవానుడే సెలవిచ్చుటవలన ఇక నట్టిశాస్త్రాదులందు జనులెంతటి విశ్వాసముంచ వలయునో యోచించుకొనవలసియున్నది. కావున ఇక వేదశాస్త్రముల గొప్పతనము విషయమై, ప్రామాణ్యము విషయమై జనులకేమాత్రము సందేహముండరాదు. అకుంఠిత విశ్వాసముతో వానియందు బోధించిన రీతి యనుష్ఠించిన చాలును. మనుజుడు తరించిపోగలడు.

'జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం' అని చెప్పుట వలన కర్మాచరణకు పూర్వము శాస్త్రజ్ఞాన మవసరమని తేలుచున్నది. శాస్త్రాదులద్వారా కర్మచేయు పద్ధతిని తెలిసికొని పిదప కర్మచేయుట ఉత్తమము. శాస్త్రపరిచయమువలన అనగా అపరావిద్యవలన ఉత్తమ కర్మాచరణము సాధ్యమై క్రమముగ చిత్తశుద్ధి గలుగగా పరావిద్యయు అనగా బ్రహ్మాను భూతియు అచిరకాలములో (అభ్యాసవశమున) లభించుట కవకాశమేర్పడుచున్నది.

'కర్మకర్తుమిహార్హసి'- అని బోధించుటవలన కర్మచేయుటలో తప్పులేదనియు, అయితే ఆ కర్మ శాస్త్రానుకూలముగా నుండవలెననియు గీత తెలుపుచున్నది. కనుకనే అర్జునుని అట్టి శాస్త్రోపదిష్ట కర్మము నాచరింపవలసినదిగా భగవానుడిచట నుద్బోధించుచున్నారు.

-దైవాసుర సంపద్విభాగమయోగము సమాప్తము-

*(తరువాయి వచ్చే సంచికలో)*

# గజ్జె ఘల్లు మంటే గుండె ఝల్లుమంటుంది! రెండు గజ్జెలు ఘల్లుమంటే హాల్ జిల్లుమంటుంది!

## -ఆగస్టున గోటింటి రెండు, మూడు తరముల వారు కూచిపూడి నృత్యరంగప్రవేశం చేశారు-

### -హాలు నిండుగా మూడు వందలమందీ ఉన్నారు - మూడు గంటల ప్రదర్శనలోనూ కరతాళంతో గళమును అనుసంధిస్తూ ఆనంద నినాదములు చేస్తూనే ఉన్నారు.



**సుప్రీత గోటేటి, గోటేటి శ్రీరామారావు, దివ్యా ఏలూరి, అంజనా గోటేటి, పద్మశ్రీ డా. నల్లి కుప్పుస్వామి చెట్టి, డా. ప్రభా రమేష్, డా. దివ్యసేవ**

ఆగస్టు 1 శనివారం సాయంత్రం 5 గం॥ల నించీ భారతీయ విద్యాభవన ఆడిటోరియలం సందడి గొలుపుతూనే ఉన్నది. రోడ్డుమీద వచ్చే కారుల బలిమి పాదచారుల ఆనంద నంద సలిమి ఘూరేణువుల నణచిపెట్టడంతో దుమ్మురేగని స్థితిని కల్పించింది. సాయంత్రం షికారుగా వచ్చే వాన చినుకులు రావడం కనిపించడం లేదు. ఆకాశం నల్లమబ్బులను తరిమేసింది.

సభా ప్రాంగణమునకు వచ్చేవారు కూచిపూడి రంగప్రవేశ నృత్యం చేసేదీ తల్లీ కూతుళ్ళట. ఆమెరికా నుంచీ రంగప్రవేశ ప్రదర్శనమివ్వడానికి వచ్చారుట- అని ఒక గొంతూ-

గోటేటి గారి కోడలూ, మనమరాలూ- తల్లీ కూతుళ్ళిద్దరూ కూచిపూడి రంగప్రవేశం (అరంగేట్రం) చేస్తున్నారుట. న్యూజెర్సీలో వారికి నాట్యం నేర్పిన దివ్యా ఏలూరిగారు కూడా ఈ ప్రదర్శనం కొరకే అమెరికా నుంచీ తీసుకుని వచ్చారుట - అని మరో గొంతు. గళాల్ని విప్పి భారతీయ విద్యాభవనం లోకి ప్రవేశించారు. లోపలికి వచ్చేసరికి హాలు నిండి ఉన్నది. కుర్చీ వెతుక్కుంటూ వెతుక్కుంటూ కుర్చీల్లో కూర్చున్నారు.

సరిగ్గా సాయంత్రం 6 గం-15 నిమిషాలకు కార్యక్రమం ప్రారంభమైంది. గోటేటిగారి పెద్ద అబ్బాయి వేంకటేశ్వరరావు చిన్న కుమార్తె 'శ్రేయా' చేసిన "ఆంగ్ల స్వాగతోక్తులతో" తెరతీయగరాదా అనకుండానే తెరతీసారు.

కూచిపూడి సాంప్రదాయ రంగప్రవేశ ప్రార్థనా నృత్యం- వాణీ పరాకు - అంబా పరాకు అనే బాలా త్రిపురసుందరీ ఆరాధనా నృత్యంతో కుమారి గోటేటి అంజన సభలోని వారందర్నీ ఆనంద ముద్రితుల్ని చేసింది. అటుపిమ్మట ఊత్తుకాడు వెంకటసుబ్బయ్య ఆనంద నర్తన గణపతి నృత్యాన్ని గురువు ఏలూరి దివ్య కూర్పుతో రమ్యాతిరమ్యంగా చేసి, ఆహూతుల అంతరంగాలనుప్పొంగింప చేసింది.



అంజనా గోటేటి

మూడవ నృత్యం ముత్తుస్వామి దీక్షితులవారి కామాక్షి స్తుతిని (డా. వెంపటి చిన సత్యం నృత్యకూర్పు చేశారు) అంగరంగ వైభవంగా అంజనా గోటేటి చేసి సభలోని వారందరి మనస్సులో మందారమకరందా లను నింపింది.

తెరతీసిన లగాయతు- 3 సాంప్రదాయ నృత్యా లనూ అవిరామంగా చేసిన అంజనా గోటేటి మిన్నంటే రసానుభూతిని కలుగజేసింది.

నవ్వుయొక్క అందమంతా దంతాలు కని పించేట్టు చేసినపుడే ఉంటుందంటారు. ఆ చిట్కాను అంజనా గోటేటి బాగా గ్రహించి ప్రదర్శినట్లుం దన్నారు రంగప్రవేశాన్ని తిలకించడానికి వచ్చిన పెద్దలు.

బాల కనకమయ చేలాతో రంగప్రవేశం చేసింది గోటేటి 3వ కోడలు సుప్రీత. ఇది త్యాగరాజ స్వామివారి కృతి. దివ్యా ఏలూరి నృత్యకూర్పు చేశారు. రారా రారా దేవాదిదేవా అంటూ ఆర్తితో త్యాగరాజస్వామి శ్రీరామచంద్రుని సంబోధించిన గీతాన్ని అఠానా రాగం, ఆదితాళంలో కూర్చారు. నాట్యానికంత అవకాశం లేని యీ గీతానికి సుప్రీత చక్కటి నృత్యాభినయాన్ని చేసి ప్రేక్షకులను భక్తి రసాత్మీయంతో ఉర్రూతలూగించారు. కొంతమంది సుప్రీతను చూచి అంజనా గోటేటియే మరల వచ్చిందనుకున్నారు.

మొదటి వరుసగా 3 నృత్యాలు చేసిన అంజనా గోటేటి - మధ్యలో తల్లిచేసిన బాల కనకమయ చేలా - నృత్యం తరువాత సొంపులూరే భామా నృత్యంతో వేదిక ప్రవేశించింది. కూచిపూడి నృత్యంలో ఆదిగురువు సిద్ధేంద్రయోగి శౌర్య, శృంగార రసములు కలబోసినట్టు నృత్యాన్ని చూస్తాం. వెంపటి చిన సత్యంలో సిద్ధేంద్రయోగి ఆవహించినట్లు- ఈ భామా నృత్యాన్ని రస

స్ఫోరకంగా కూర్చారు. ఆయన కూచిపూడి అకాడమీ విద్యాలయంలో విద్యార్థులకు నేర్పే ముందు కళ్ళారా చూసాను. వేదాంతం సత్య నారాయణశర్మ సత్యభామగా నర్తించినపుడు చూసాను. డా॥శోభానాయుడు నర్తించినపుడు చూసాను. శైవా మేష్టరు బోధించేటప్పుడు చూసాను. కానీ చిన్నారి అంజనా గోటేటి – సత్యభామ ముఖకవళికల్లో శృంగారాన్ని, వగరుబోతుతనాన్ని వాలుజడను ఎగరవేసు కుంటూ, క్రీగంట చూస్తూ – మిశ్రపుతాళంలో, భైరవి రాగంలో చేసి 'నాకు సరిరారెవ్వరూ' అన్నట్లు చేసింది. ఆడిటోరియంలోని వారం దర్నీ ఆనందాబ్ధిలో ముంచెత్తింది.

అటు తరువాత భో శంభో అన్న దయా నంద సరస్వతి కీర్తనను – ఎలుగెత్తి శివుని మొరలాడుతున్నట్లూ, శివుడు తాండవం చేసినట్టు– గంగానది అలలు వోలె భరత సంభరిత నృత్యంతో ఎంత బాగా చేసిందనేది అక్షరబద్ధంగా చెప్పడం కష్టమే– అంజనా గోటేటికి కొంత విరామమిస్తున్నట్లు తాగ్యరాజ స్వామివారి జగదానంద కారకా అను కీర్తనను సుప్రీతా గోటేటి ఆదితాళంలో, వెంపటి చిన సత్యం కూర్పులో సుప్రీతా గోటేటి నర్తించి సెహబ్బాష్ అనిపించుకున్నది.



సుప్రీత గోటేటి

మరలా అంజనా గోటేటి రంగప్రవేశం చేసి జయదేవుని అష్టపదిలో రాధ విరహాన్ని, కృష్ణుడి మోహాన్ని శృంగార భక్తియుక్తంగా ప్రదర్శించిన తీరు వర్ణనాతీతం. మరల ఊతుక్కాడు వెంకటసుబ్బయ్య కవి విరచితమైన మరకతమణి చేలా కీర్తనలోని శ్రీకృష్ణుని రాసలీలా విలాసాన్ని తల్లీకూతుళ్లు సుప్రీతా గోటేటి, అంజనా గోటేటి రసస్ఫోరకంగా నర్తించారు.


విశ్వవిద్యాలయం వారెవరైనా ఈ ప్రదర్శనను చూచివుంటే ఇరువురికీ డాక్టరేటు యిచ్చేవారేమో! కూచిపూడికి ప్రధానంగా కావాల్సింది మువ్వల సవ్వడి. భావ ప్రకటనం, రెండు కన్నులూ అరవిచ్చిన పద్మాల్లా ఉంటూ, కలువఱేడు చూస్తున్నట్లు పైనా, కిందకూ, ఇరుపక్కలకూ కదులుతూ, వేదికనొక ప్రక్క నుంచీ మరో ప్రక్కకూ, ముందుకూ వెనుకకు శృంగార విహారం చేస్తు న్నట్లుండాలి. ఇద్దరు రంగప్రవేశం చేసినపుడు– థిల్లానాలో వారి పోటీ కనిపిస్తుంది. పద్మ భూషణ్ డా॥ మంగళం పల్లి బాలమురళీకృష్ణ నవనమోహన బాలకృష్ణీయంగా కూర్చిన యీ తిల్లానా నృత్యంలో తల్లీ కూతురూ పోటీపడి నర్తించారు. చూడడానికి కిరువురూ అక్కా చెల్లె ళ్లుల్లా ఉన్నారు. కూచిపూడిలో పదవిన్యాసం కోసం నర్తకులు పళ్ళెములపై ఈ నృత్యం చేస్తారు. పళ్ళెం అంచులపై పాదం మోపి నాట్యం చేస్తూ, వేదికనలువైపులా తిరిగేటపుడు పాదాలు రక్తసిక్తమవుతాయేమో అనిపిస్తుంది. అనాయసంగా ఈ థిల్లానా చేయడం కష్టంతో కూడుకున్న నృత్యం. అవిరామ శ్రమైకం. సహ గాయకులకేవీ సునాయసంగా పాడేస్తారు. నర్తకులకే కష్టం. చాలా చాలా నృత్య ప్రదర్శన ముల్లో ధీటైన నర్తకీ (ర)మణుల్ని చూసాను. వారెంతగా దస్సిపోయారో! అలాటింది అంజనా గోటేటి, సుప్రీతా గోటేటి ఎంతో రమ్యంగా, రమణీయంగా హృద్యమంగా చాలా సుళువుగా చేయడం చూసేవారందర్నీ విస్మయ పరిచింది. వినోదపరిచింది. వారిరువురూ అభిముఖంగా తిరుగాడినపుడు – తల్లి యెవరో, కుమార్తె యెవరో తెలియరాలేదు.

విశాఖపట్టణంకుచెందిన దివ్య ఏలూరి డా॥ వెంపటి చినసత్యం వద్దనే నృత్యం అభ్యసించారు. సాఫ్ట్‌వేర్ నిపుణురాలైన దివ్య న్యూజెర్సీలో ఉద్యోగం చేస్తూనే నృత్య మాధవీ నృత్యపాఠశాలను నడుపుతూ ఎంతోమందికి కూచిపూడి నృత్యం నేర్పుతూ నర్తకీమణులుగానే గాకుండా, నృత్యగురువులుగా తయారుచేసింది. అమెరికా సం యుక్త రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలన్నిటిలోనూ ఆమె శిష్యు లచే నృత్య ప్రదర్శనములు చేయించడం జరిగింది. తానా, నాటా, ఆటా – ఎన్నో సంఘాలు ఆమెను గౌరవించాయి.

ఏ చెన్నై మహానగరంలో వెంపటి చిన్న సత్యంగారి వద్ద తాను కూచిపూడి నృత్యము నభ్యసించారో ఆ చెన్నయ్ లోనే ఆమె శిష్యులు అంజనా గోటేటి, సుప్రీతా గోటేటిలచే రంగప్రవేశం (అరంగేట్రం) చేయించడానికై ప్రత్యేకంగా చెన్నయ్ వచ్చారు. నట్టువాంగం చేస్తూ కొన్ని కీర్తనలనాల పించారు.


గానంలో టి. హెచ్ త్యాగరాజన్, శ్రీమతి రోషిణీ గణేష్‌లు అద్భుతంగా పాడారు. మృదంగాన్ని వి. వేద కృష్ణారామ్, ఫ్లూటును ఇ. దేవరాజ్, వైలెన్‌ను కే. గణేషన్, వీణను అనంతనారాయణ – తమ తమ వాయిద్యాలతో ఇంద్రదర్బారు, భోజరాజ దర్బారులను స్ఫురింపచేసారు. వీరందరూ మేటి విద్వాంసులు.

గోటేటి మూడవ కుమారుడు నాగసాయి ప్రసాద్ న్యూయార్క్ ప్రభుత్వంలో పనిచేస్తూనే– తన భార్య సుప్రీ తను, కుమార్తె అంజననూ కూచిపూడి నృత్య ప్రవీణుల్ని చేస్తూ గురుతరమైన బాధ్యతను తీసుకోవడమే గాకుండా, మద్రాసుకు తీసుకుని వచ్చి రంగప్రవేశ ప్రదర్శనమిప్పిం చడం ఓ సాహసమని అందరూ ప్రశంసించారు. సాయి ప్రసాద్ అత్తింటివారూ, పుట్టింటివారందరూ ప్రదర్శనం చూసే అవకాశం కలుగజేశారు. ●



అశ్వధ్ గోటేటి, సుప్రీతా గోటేటి, నాగసాయి ప్రసాద్ గోటేటి, అంజనా గోటేటి

# డోలీలో వెళ్ళే ప్రయాస నుంచీ బస్సుల్లో వెళ్ళే అనాయాసకొచ్చాం



డోలీల్లో యాత్రికులను మోసుకెళ్తున్న కూలీలు

ఎడ్లబండిలో కొండకు చేరుతున్న భక్తులు

## తిరుమల నాధుని బ్రహ్మోత్సవాలు తిలకించండి.

## అప్పుడు బ్రహ్మాండ నాయకుని దర్శించడానికెంత ప్రయాసో!

**బ్రహ్మోత్సవాలలో స్వామిని దర్శించడానికి కష్టమే! మలయప్పస్వామి వివిధా భరణాలతో, వాహనాలతో దర్శించాలంటే బ్రహ్మోత్సవాలను దర్శించి తీరాలి! అన్యధా శరణం నాస్తీ! త్వమేవ శరణమ్ మమ అని శరణాగతులం కావాలి!**

"ఏడుకొండలస్వామీ ఎక్కడున్నావయ్యా... ఎన్ని మెట్లెక్కినా కావనరావేమయ్యా..." అంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ నాలుగువేల మెట్ల వరకు ఎక్కాలి అలసి సొలసి ఆ స్వామిని దర్శనం చేసుకునేవారు. డోలీ, ఎడ్లబండి నుంచీ కారుల వరకూ వచ్చారు. ఒక రోజంతా పట్టే ప్రయాణం 40 నిమిషాలకు వచ్చింది.

20వ శతాబ్దపు తొలి రోజుల వరకు తిరుమల... వానానికి అనువు కాని కొండకోనలమయం. చిక్కటి అడవి. కనీకనిపించని మెట్లు. కొన్నిచోట్ల ఉంటే ఇంకొన్ని చోట్ల ఉండేవి కావు. క్రూరమృగాల సంచారం. విపరీతమైన చలి. కొండపై ఉండాలంటే నిప్పుల కుంపటి సెగ తప్పనిసరి. కొండపైకి చేరుకోవాలంటే నడక తప్ప అన్య మార్గం లేదు.

రాజులు, ఆర్కాటు నవాబులు, మహంతులు, బ్రిటిష్‌వారు... స్వామి సన్నిధికి చేరుకోవడానికి, పరిపాలన సౌలభ్యం కోసం రకరకాల మార్గాలు ఏర్పాటుచేసు కున్నారు. అలా ఏర్పడినవే. తిరుపతిలోని అలిపిరి, శ్రీనివాస మంగాపురంలోని శ్రీవారి మెట్టు, కడప జిల్లాలోని తుంబుర తీర్థం మార్గం, మామండూరు నుంచి వెళ్లే ఈత కాయల మండప మార్గం. ఆయా మార్గాల గుండా సమీప ప్రాంతాల నుంచి జనం కొండపైకి ఎక్కి వెళ్ళేవారు.

1843 నుండి శ్రీవారి ఆలయం మహంతుల పాలనలోకి వెళ్లింది. తిరుమల వెంకన్న క్షేత్ర మహిమ జనంలోకి పాకడం, భక్తుల రాక పెరగడం, క్రూర మృగాలతో నిండిన అడవి కావడంతో భక్తులు గుంపులుగా వచ్చేవారు. వయసు మళ్లిన వారిని మోసుకెళ్లేవారు. సౌలభ్యం కోసం పొడవాటి బలమైన కర్రకు కంబళి, గోనె దుప్పట్లు కట్టి ఉయ్యాల్లాగా చేసి మోసుకెళ్లేవారు. కొన్నాళ్లకు డబ్బు ఇచ్చి డోలీ కట్టించుకోవడం అలవాటైంది. దమ్మిడీ, అణాల నుంచి రూపాయి వరకు డోలీ రుసుము ఉండేది. కొత్తూరు (తిరుపతి పూర్వనామం), చంద్రగిరి, పెరుమాళ్లపల్లి, పేరూరు, శ్రీనివాస మంగాపురం నుంచి ఎన్నో కుటుంబాలు ఈ డోలీ వ్యవస్థలో పనిచేశాయి. అలిపిరి నుంచి గాలిగోపురం మీదుగా ఏడవ మైలు, మోకాళ్ల పర్వతం మీదుగా గరుడాద్రి నగర్ (తిరుమలలో ముఖద్వార ప్రాంతం) సమీపంలోని డోలీ మండపం వరకు భక్తులను మోసుకెళ్లేవారు. డోలీలు మోసేవారు మార్గమధ్యంలోని చలివేంద్రాల్లో కొంత సమయం సేద తీరేవారు. శరీర దారుఢ్యంతోపాటు కొండబాట అలవాటుపడటంతో దాదాపుగా ఆరేడు గంటల్లో గమ్యస్థానానికి చేరవేసేవారు.

### ఎడ్లబండి ప్రయాణం

మహంత్ ప్రయాగ్‌దాస్ హయాంలో మట్టిరోడ్డు ఏర్పాటు కావడంతో ఎడ్ల బండ్ల ప్రయాణం మొదలైంది. దీంతో భక్తులకు కొంత ఊరట కలిగింది ఎక్కువ మందికి కాస్త తక్కువ రుసుముతోనే రవాణా దొరికింది. ఇవి చాలాకాలంపాటు నడిచాయి. వీటిపైనే సరుకులు రవాణా చేశారు. ప్రస్తుతం కొండపైకి సరుకుల రవాణా చేసే లారీలున్నాయి. మునుపటి కాలంలో ఇదే ఎడ్లబండ్ల సంఘం. ప్రస్తుతం తిరుమల లోని డీఎంబీ రోడ్డు అప్పట్లో డోలీ మండపం బ్లాక్‌గా పిలువబడేది. ఇప్పటికీ తిరుమలలో రెండు మండపాలు డోలీ వ్యవస్థకు సాక్ష్యాలుగా మిగిలి ఉన్నాయి.

### 1944లో మోటారు వాహనం

1944 ఏప్రిల్ 10వ తేదీ తిరుమల తొలిఘాటు రోడ్డు ఏర్పాటైంది. అప్పటి ఉమ్మడి మద్రాసు బ్రిటిష్ గవర్నర్ అర్తర్‌హోప్ నేతృత్వంలో ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య తొలి ఘాట్ రోడ్డుకు రూపకల్పన చేశారు. టీటీడీ ట్రాన్స్‌పోర్టు సంఘం ఆధ్వర్యంలో తొలి రోజుల్లో నల్లరంగులోని మినీ బస్సులు నడిచాయి. తిరుపతి మొదటి సత్రం నుంచి రోజుకు మూడు ట్రిప్పుల చొప్పున రెండు బస్సులు. ఒకే రోడ్డుపై ఎదురెదురుగా తిరిగేవి. వీటి ఛార్జీ నాలుగణాల నుంచి మొదలయ్యింది. 1961లో రెండవ ఘాట్ రోడ్డుకు అప్పటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య. టీటీడీ ఛైర్మన్ పి.ఎస్.అప్పారావు హయాంలో పునాది వేశారు. 1973లో నాటి టీటీడీ ఛైర్మన్ గోకరాజు రంగరాజు రెండో ఘాట్‌రోడ్డును ప్రారంభించారు. అదే ఏడాది ఛైర్మన్ చెలికాని అన్నారావు హయాంలో వాహనాల రాకపోకలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యాయి. ఆ ఘాట్ రోడ్డు నిర్మాణం ద్వారా తిరుమలకు ప్రయాణ సౌకర్యం బాగా మెరుగుపడింది.

మొదటి ఘాట్‌రోడ్డులో తిరుమల నుంచి తిరుపతికి, తిరుపతి నుంచి తిరుమలకు వచ్చే వాహనాలు రెండవ ఘాట్ రోడ్డు రాకపోలు సాగిస్తాయి. కొంత కాలంతర్వాత ప్రభుత్వం జోక్యం చేసుకుని టీటీడీకి ఆర్టీసీకి ఒప్పందం కుదిర్చింది. అప్పటినుంచి కొండకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి. సాధారణ బస్సుల నుంచి హైటెక్ బస్సుల వరకు కొందరు రాకపోకలు సాగిస్తున్నారు. భక్తుల సంఖ్య పెరగడంతో ప్రైవేట్ జీపులు, వాహనాలు కొండపైకి జనాన్ని చేరవేస్తున్నాయి. అన్ని రకాలు కలిపి రోజుకు సుమారు 8, 10 వేల వాహనాలు రాకపోకలు జరుపుతున్నారు. ●

# దాశరథి కృష్ణమాచార్య

## తెలంగాణా తిరుగుబాటు కవి - తెలుగు సినిమాల పాటల కవి



నన్ను వందనంగా మేష్టారూ – అని పిలిచేవారు – ఆయనకన్నా – నేను ఎనిమిదేళ్ళ చిన్నవాణ్ణి. నా 'మధురవాణి' పత్రిక ఆయన మెప్పుల్ని అందుకున్న పత్రిక. నేను గెడకర్రలా పొడుగ్గా ఉండేవాణ్ణి. దాశరథి గారు పొట్టిగా – పొట్టికి తగ్గటు లావుగా ఉండేవారు

తరచు మేము అన్నపూర్ణా పిక్చర్సు ఆఫీసులోనే కలుసుకుంటూండేవాళ్ళం. నాకున్న రెండు జ్ఞాపకాలూ కరెక్టు కావచ్చు – లేదా కేరమ్స్ బోర్డులో తెల్లబిళ్ళ వచ్చి ఎర్రబిళ్ళ నల్లబిళ్ళల్ని రెండూ బోర్డు గడిలోకి కొట్టినా కొట్టవచ్చు.

అందొకటి – తెలంగాణా కవులుగా సి.నారాయణరెడ్డి, దాశరథి కృష్ణమాచార్య ఏకకాలంలోనే ఆంధ్రా హాలీవుడ్‌లో అడుగుపెట్టినట్టూ – ఒకరికొకరు పోటీ పడకుండా చక్కని తీయని తెలుగు పాటలు వ్రాసి స్వరకర్తలు ఎస్.రాజేశ్వరరావు, వేణు మేటి సంగీత దర్శకుల మెప్పు పొందారు.

రెండవది టంగుటూరి అంజయ్యగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దాశరథి గారు ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా నియమింపబడినట్లొక జ్ఞాపకం ఉన్నది.

నాకు కనిపించనప్పుడల్లా నమ్రతగా చిరునవ్వు రువ్వుతూ – నోటికొక జేబురుమాలు అడ్డుపెట్టుకుని మాట్లాడేవారు. సరళమైన మనసూ, సంతోషంగా కనిపించే మోమూ చూచినప్పుడు ఈయన తెలంగాణా తిరుగుబాటు కవియా – నిజాం రాజు జన్మజన్మల బూజు దులిపేలా గర్జించేవాడా? ఘట్టిగా నిర్మాతల్ని డబ్బు అడగలేని మెత్తని మనిషి, నైజాం నవాబు విషయంలో అంత కర కర కొర కొరగా ఉండేవాడా అనుకునేవాణ్ణి.

ఎవరో ఆయన్ను 55 యేండ్లకే ముఖంలో ముడతలు వచ్చాయేంటి – అని అడిగాడు. ఆయనో పెద్ద పోలీసు ఆఫీసర్. కండలు తిరిగి ఉన్నాడు.

దాశరథి ఎంతో నిదానంగా – యాభై అయిదా ఐదు ఐదూ రెండయిదులు కదా! ఐదుకు ఐదును కలిపితే – పది – పది వత్సరాలంటే బాల్యం అన్నమాట. పోనీ 5ను 5తో గుణిస్తే 25 – అంటే పాతిక, యవ్వన దశ అన్నారు.

నడుం పూర్తిగా వంగిపోయినవాడు ఒక ముసలివాడు నడుస్తున్నాడు – "తాతా! యేం వెతుకుతున్నావు?" అని అడిగింది ఒక చిన్నది. "పోయిన యౌవనాణ్ని వెతుక్కుంటున్నాను" అన్నాడు వృద్ధుడు.

ప్రశ్నోత్తర రూపంలో వున్న ఈ ఫార్సీ కవిత – రాజు జహంగీరూ, రాణి నూర్జహాను మధ్య జరిగిన సంభాషణ. నడ్డి వంగి నడుస్తున్న ముసలివాడు పోయిన యౌవనాన్ని వెతుక్కుంటున్న వాడిలా వున్నాడని చమత్కారం.

మా మదర్సా (బడి)లో మౌల్వీ (పంతులు) ఈ కవిత చదివి అర్థం చెబుతుంటే నేను నా ధోరణిలో చిన్నతనంలో అనువదించుకున్నాను. ఇది ఎందుకు జ్ఞాపకం వచ్చిందంటే – ఈమధ్య ఒక మిత్రుడు – నాతో చదువుకున్నవాడు కలిసి "నీ ముఖంలో ఇప్పుడు వృద్ధాప్యపు ఛాయలు కనపడుతున్నాయేమోయ్?" అని నన్ను అడిగాడు. అతను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఇప్పుడు పని చేస్తున్నాడు. దృఢకాయుడు. కానైతే నా వయస్సే యాభై అయిదు.

> **యాభై అయిదులో రెండు అయిదులున్నాయి కదా! అయిదుతో అయిదు ప్లస్ చేస్తే బాల్యం (పదేండ్లు). అయిదుతో అయిదు ఇంటూ చేస్తే యౌవనం (పాతిక). అయిదు పక్కన అయిదు వ్రాస్తే యాభై అయిదు. వార్ధక్య ద్వారం!**

అయిదులో మరో చమత్కారం వుంది. మన్ను, మిన్ను, నీరు, గాలి, వెలుతురు – కలిపి పంచభూతాలు. ఇవి ఒక ఫార్ములా ప్రకారం సమ్మేళనం చెందితే ప్రాణి ఉద్భవిస్తుంది. ఆ సమ్మేళన భగ్నమైతే ప్రాణి చనిపోతుంది.

పంచభూతాల సమ్మేళనం జననం –

పంచభూతాల ఛిన్నాభిన్నం మరణం.

సుప్రసిద్ధ ఊర్దూ కవి బ్రిజ్‌నారాయణ్ చక్ బస్తు కవితలను మేము తరచు చదువుతూ వుండేవాళ్ళం. ఆయన కవితల్లో సుప్రసిద్ధమైనది ఇదే అర్థాన్ని బోధిస్తున్నది అంటూ ఇలా అనువదించారు:

**"పంచభూతాల కలయిక ప్రాణమౌను**
**వాని విడిపోవుటయే అవసానమౌను."**

ఏభై అయిదేళ్ళ వయసులో అప్పుడే ముసలితనం జీవితంలో ప్రవేశిస్తుందని నేను నమ్మను. అరవై దాటేక చూసుకుందాం. అప్పటివరకు యౌవనోత్సాహంతోనే సాగిపోతాను. వయసు కంటే మనసు ముఖ్యం. రమారమి అర్ధ శతాబ్దం జ్ఞాపకాలు ఎప్పుడూ వెంటాడుతుంటాయి. నా బాల్యం నుంచీ ఇంటా బయటా మాతృభాష మీద దండయాత్రలు జరిగాయి. నాటి నిజాం ప్రభుత్వ ఉర్దూను బోధనా భాషగా నిర్ణయించింది. బడిలో ఉర్దూలోనే బోధన. ఒక ఇంట్లో మా నాయనగారు సంస్కృత భాషాధిక్యాన్ని గూర్చి చెబుతుండేవారు. స్నానం చేసి మడికట్టుకుంటే సంస్కృతంలోనే మాట్లాడేవారు. తెలుగులో మాట్లాడితే మైలపడిపోతామో అని భయపడే ఛాందసుడాయన.

"నువ్వు ఎటు వెళుతున్నావ్" అనడానికి "త్వంకుత్ర గచ్ఛసి" అనేవారు! నాకు సంస్కృతం మీద గౌరవమే గాని, ఇంతటి ఛాందసం నాకు నచ్చేది కాదు. ఇక మదర్సా బడిలో ఉర్దూలో ప్రార్థనతో మా దినచర్య ప్రారంభమయ్యేది. ("ప్రళయకాలం వరకూ పరమేశ్వరుడు ఈ రాజ్యాన్ని (హైదరాబాదు) సుస్థిరంగా వుంచుగాక.") "తాబద్ ఖాలిఖె ఆలం, యెరియాసత్‌రక్షే" అనే పల్లవితో ఈ ప్రార్థనాగీతం ప్రారంభ మయ్యేది. ఏడుస్తూ ఈ ప్రార్థన చేసేవాళ్ళం. ప్రార్థన చేసేవారితో గొంతు కలపని వారిని కొట్టేవాడు హెడ్ మాస్టరు. అలా దెబ్బలు తిన్నవాళ్ళలో నేనొకణ్ణి. ఇలా ఇంటా బయటా నా బాల్యంలో తెలుగుమీద దండయాత్రలు ప్రారంభమయ్యాయి. నేను ఇంట్లోను, బడిలోను ఎదురుతిరగవలసి వచ్చింది. నాలో తిరుగుబాటు బీజాలు అప్పట్లో ఆ విధంగా నాటుకున్నాయి అన్నారు దాశరథి. ●


*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

b-d

**Bhimas Deluxe Hotel**

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station),**
**TIRUPATI - 517 501 (A.P.)**
**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**
**Website : www.bhimasdeluxehotels.com**
**E-mail : bhimasdeluxe@rediffmail.com**

# టీడీపీ జాతీయ పార్టీ ప్రయోజనం లేని నిర్ణయం బాబు సర్కారు వెంటనే ఏపీకి తరలాలి

– డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి

**ఆయన డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి. ఏ విషయాన్నైనా ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెబుతారు. ఆయన నఖశిఖ పర్యంతమూ 'భారతీయత'నే వొంటికి పూసుకుంటారు. ఆయన్ను జూచి వయస్సు భయపడుతుంది. 'సత్కవుల్ హాలికులైన నేమి' అన్న పోతనగారి పద్యంలోని ఒక పాదమే ఆయన్ను మూర్తీభవించేట్లు చేస్తుంది.**

తెలుగుదేశం పార్టీకి జాతీయపార్టీగా గుర్తింపు తెచ్చుకోవడం కోసం... తెలుగు మాట్లాడే ప్రజలు ఉన్న తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలలోని పార్టీని విస్తరించాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. మన రాష్ట్రంలో తమిళ, కన్నడ, మరాఠీ, ఒడిసా మాట్లాడే ప్రజల సరిహద్దు జిల్లాలలో ఉన్నారు. కర్ణాటక, తమిళనాడులలో కొన్ని తెలుగు కులాల వారిని బీసీ కేటగిరిలో చేర్చారు. తద్వారా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతున్నారు. అక్కడి తెలుగు వారందరూ మెజారిటీ భాష మాట్లాడేవారితో మమేకమై ఆ రాష్ట్రాల్లో వున్న పార్టీ సభ్యుడుగా, ఓటర్లుగా కలసి మెలసి ఉంటున్నారు. ఇప్పుడు అటువంటివారిని ప్రాంతీయ పార్టీ అయిన టీడీపీలో చేర్చుకుంటే వారందరూ ఆయా రాష్ట్రాలలో వివక్షతకు గురయ్యే ప్రమాదం వుంది. "మా రాష్ట్రంలో వుండి, మా సంక్షేమాన్ని పొందుతూ, రిజర్వేషన్లు అనుభవిస్తూ, మీ భాష ప్రాతిపదికన పార్టీ పెట్టుకొని, మాతో పోటీ చేస్తారా? మీరెలాగూ అల్ప సంఖ్యాకులు, మీ భాషాభిమానంతో మాకు వ్యతిరేకంగా పోటీ చేసి మమ్ములను బలహీనపరుస్తారా?" అని వారు అడిగితే మన తెలుగు సోదరులు ఏవిధమైన జవాబు ఇవ్వగలరు? వీరిది వేర్పాటువాదం అని నేరాన్ని ఆపాదించరూ? చిత్తూరు జిల్లాల్లో తమిళులున్నారు. వారు ద్రవిడియన్ పార్టీలు పెట్టి టీడీపికి వ్యతిరేకంగా పోటీ చేస్తే... అటువంటి తమిళులను మనం ప్రేమిస్తామా? ద్వేషిస్తామా?



దివంగత మహానాయకులు నందమూరి తారక రామారావు గారు తెలుగుదేశం పార్టీని ఎందుకు పెట్టారంటే, మద్రాసీలని పిలవబడుతున్న మనకు ప్రత్యేక అస్తిత్వం ఉందని, మన జాతి గౌరవాన్ని దేశమంతట చాటటం కోసం... మనల్ని పదే పదే అవమానపరుస్తున్న కాంగ్రెస్ అధినేతలు ఇందిరాగాంధీకి, రాజీవ్‌గాంధీకి బుద్ధి చెప్పడానికి ప్రారంభించారు. కాంగ్రెస్‌ను మట్టి కరిపించారు. 1989లో దేశంలోని అన్ని కాంగ్రేసేతర పార్టీలను ఒక తాటిమీదికి తీసుకువచ్చి ఢిల్లీలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని నిర్మింపజేశారు. దాంతో తెలుగువారంటే, రామారావుగారంటే భారతదేశమంతటా గుర్తింపు వచ్చింది. ఆ కూటమిని చిరస్థాయిగా ఉంచాలనే ఉద్దేశంతో ఒకప్పుడు రామారావు గారు భారతదేశం అనే పార్టీని పెట్టి, దాన్ని దేశమంతటా వ్యాపింప ఆలోచించారు. భారతీయులందరికీ ఆ పార్టీ అన్నారు. అంతేకాని తెలుగువారికి మాత్రమే కాదు. ఆయన దరిమిలా తె.దే.పాకి ఒక నిర్దుష్టమైన రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, సిద్ధాంతపరమైన భావజాలం (ఐడియాలజి) కనిపించదే. కేవలం తెలుగు నేల మీద కాంగ్రెస్ దుష్టపాలనను అంతమొందించడం, రాష్ట్ర వనరులను ఉపయోగించుకుని, రాష్ట్ర ప్రజల అభివృద్ధికి మాత్రమే కట్టబడి ఉన్నది. మన పొరుగు రాష్ట్రాలయిన తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశాలతో నదుల విషయంపై తీవ్రమైన విభేదాలున్నాయి. కలహాలున్నాయి. తెలంగాణాతో ఒక నదులే కాదు, మరెన్నో విషయాలలో కలహిస్తున్నాం. తెలంగాణాని ఏలుతున్న తెలంగాణా రాష్ట్ర సమితి, టీడీపీ ఈ నేలమీద ఎందుకు ఉండాలని, అక్కడినుండి తరిమి కొట్టేస్తామని, పదే పదే చెబుతున్నది. తెలుగు భాషా ఆధిక్యం ఉన్న తెలంగాణాలోనే ఉనికికి క్లిష్టతరమౌతున్న పరిస్థితులలో, రెండు రాష్ట్రాలకు సమన్యాయం చేయలేరని తెలంగాణా ప్రజలు బాధపడుతుంటే, ఏవిధంగా టీడీపి సరిహద్దు రాష్ట్రాలలో కార్యకలాపాలు ప్రారంభించి తెలుగువారికి మంచి చేయగలదు?

తాత్కాలిక ప్రయోజనం కోసం పావులు కదిపితే దీర్ఘకాలిక నష్టం కలుగవచ్చు అచ్చటి తెలుగు ప్రజలను విస్తృతంగా సంప్రదించి ఆ ప్రాంతపు రాజకీయ పార్టీలను రెచ్చగొట్టకుండా ఉండే విధంగా, సుదీర్ఘంగా ఆలోచించి, సంప్రదించి, స్వప్రయోజనం కోసం కాక, భారతదేశ ప్రయోజనం కోసం ఆలోచించడం మంచిది.

## వెంటనే ఏపీకి తరలండి

ఆర్టీసీ కార్మికులు మే నెలలో వారంపైగా సమ్మెచేశారు. తెలంగాణా ఏర్పడిన సంతోషంతో ఆ రాష్ట్ర ఆర్టీసీ ఉద్యోగులకు తెలంగాణ సీఎం 43% జీతం పెంచారు. విభజనతో నష్టపడ్డ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా వారి ఉద్యోగులకు అదే విధంగా జీతం పెంచింది. ఆర్టీసీ కార్మికులు మేమూ ప్రభుత్వోగ్యులమే కదా, మాకూ కూడా జీతం అంతగా పెంచాలి అని కోరుతూ సమ్మెకు దిగారు. దీన్ని ఏ ముఖ్యమంత్రీ చాలా కాలం పట్టించుకోలేదు. ప్రజలు మాత్రం తీవ్రమైన ఆర్థిక నష్టానికి, కష్టానికీ గురి అయ్యారు. చివరకు దీని కార్యాలయం హైదరాబాద్‌లో ఉండడం మూలానా తెలంగాణా ముఖ్యమంత్రిగారి నిర్ణయమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా శిరోధార్యం అయింది. ఉమ్మడి సంస్థల కార్యాలయాలు హైదరాబాద్‌లో ఉన్నంతవరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ప్రజలకు చిక్కులే! తెలంగాణా ప్రభుత్వం హైదరాబాద్‌లో ఉన్న 96 కార్యాలయాల భవనాలను తనవే అంటున్నది. ఆ భవనాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సైన్ (సూచిక) బోర్డులు ఉండడానికి వీలులేదని అంది. ఇంతగా ఈసడించుకోబడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఎందుకు ఉండాలి. మద్రాస్ నుంచి విడిపోయి, రాత్రికి రాత్రి గెంటి వేయబడి, కర్నూలులో ప్రభుత్వ కార్యాలయములను, శాసన సభలను ఏర్పరచుకోలేదా! సింగపూర్ మేధావులు రాజధానికి సంబంధించిన పని పూర్తి చేసే వరకూ హైదరాబాద్‌లో ఉండి, ఆంధ్రప్రదేశానికి టూరిస్టుల లాగా పాలన చేస్తారా? హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ కార్యాలయాలున్నంత వరకూ ద్వేషం రగులుతూనే ఉంటుంది. భారతదేశం విభజించబడినప్పుడు పాకిస్తాన్ ఏర్పడినప్పుడు తక్షణమే (14/8/1947) మూటముల్లి సర్దుకుని పాకిస్తాన్ ప్రభుత్వం ఢిల్లీని వదిలి కరాచీకి, తూర్పు పాకిస్తాన్ ప్రభుత్వం కలకత్తాను వదిలి, ఢాకాకు తరలి వారి సాహసము, ఆత్మగౌరవం ఎవరికీ ఎరుక లేదా?

**(కమ్మ దేశం పత్రిక సౌజన్యం)**


Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# మూడు దశాబ్దాల సాహితీ పోషణం మూడు శకాలు జ్ఞాపకాలు నిలిచి ఉంటాయ్!

## రాజా పి.వి. రమణయ్య రాజా! ఓ నవభోజుడు! ఆయనో శకపురుషుడు!

కులీన వైశ్యకుటుంబంలో పుట్టి జార్జిటౌన్‌లోని సుంకురామచెట్టి వీధిలో కమీషను వ్యాపారం చేసి, ఆ రోజుల్లోనే లక్షాధికారియైన పి.వి. రమణయ్యరాజా- తన లక్ష్యాన్ని సాహిత్యం పోషించడంలో, కళల్ని ఆదరించడంలో నిమగ్నుడయ్యారు. 'రాజా' అన్న చివరి పదాన్ని సార్థకం చేసుకున్నాడు.

ఎల్వీ రామయ్య యాదాళం కంపెనీతో ఆయన వ్యాపార జీవితం మొగ్గతొడిగింది. అదే జార్జి టౌనులోని సుంకురామచెట్టి వీధిలో ప్రారంభింపబడిన రాజా రమణయ్య రాజా వాణిజ్య కంపెనీతో మొగ్గగా వికసించి, తొడిమి తొడిగి పువ్వుగా పుష్పించి, పారిజాత కుసుమంలా గుభాళిస్తూ వచ్చింది.

పారిజాత వృక్షాన్ని పరంధాముడు దేవలోకం నుంచీ తెచ్చాడు. ఆ వృక్షపు కుసుమాలు, సౌగంధికాలు కావడానికదే కారణం. రమణయ్య రాజా సాహితీ పారిజాత కల్పవృక్ష పోషణం భోజరాజు ప్రసాదితమే అనుకుంటున్నాను. ఆయన వ్యాపారంలో బాగా వికసించకుండా ఉన్న సమయంలోనే, లాభాల్లోని కొంత భాగం సాహితీవతంసుల్ని ఆదరించడం కోసం కేటాయించారు. పుష్పం చుట్టూ తుమ్మెదలు వాలినట్లు- ఆయన వ్యాపార కార్యాలయం సూర్యాస్తమయే సరికి సాహితీ చంద్రోదయ మయేది. ఒక్కరొక్కరే సాహితీ వతంసులు వచ్చేవారు. బీఎస్సార్ కృష్ణ, ఎన్నార్ చెందూర్, పప్పు వేణుగోపాలరావు లెందరెందరో వచ్చి ఆయనలో సాహితీ తృష్ణను కలిగించారు. అలా అలా అది రాజ్యలక్ష్మి ఫౌండేషన్ ఏర్పడడానికి కారణమైంది. రాజ్యలక్ష్మి ఆయన హృదయ సామ్రాజ్యలక్ష్మి. మహాలక్ష్మి కళలుట్టిపడే ఆమె రమణయ్య రాజా అష్టలక్ష్మిగా, మహాలక్ష్మిగా, రాజ్యలక్ష్మిగా వరలి, ఫౌండేషన్ కార్యక్రమాల పటిష్టతకు దోహదకారిణి అయింది. రాజ్యలక్ష్మి అవార్డు తొలి పురస్కారం మహాకవి శ్రీశ్రీగారికి రూ.10,000 ప్రదానంతో ప్రారంభమైంది .

రమణయ్య రాజా తన వ్యాపార బాధ్యతల్ని కుమారులు వెంకటరావు, కృష్ణారావు లకు అప్పగించి, తాను మరికొంత సమయాన్ని ఫౌండేషన్ కార్యక్రమాలకు కేటాయిస్తూ వచ్చారు. తన వద్దకు వచ్చే రచయితలకూ, కళాకారులకూ యధోచితంగా ఆర్థిక సహాయం చేసేవారు.

ఏదైనా కార్యక్రమానికి వచ్చినపుడు వెనుకవైపు కూర్చునేవారుగానీ, ముందు సీట్లోకొచ్చి కూర్చునేవారు కారు. ఆయన చేసిన కార్యక్రమాలకైతే తెరవెనుక ఉండే వారు. స్టేజిపైకి వచ్చేవారు కారు. 1979 సం॥ము జూలైలో రాజలక్ష్మి ఫౌండేషన్ ప్రారంభింపబడి మూడుదశాబ్దాలు కార్యక్రమాలను జయప్రదంగా నిర్వహించింది. రూ.10,000లతో ప్రారంభమైన పురస్కార ప్రదానం రూ లక్ష రూపాయల రొక్క బహుమానంగా ఎదిగింది.

ఎందరో సాహితీవేత్తలూ, కళాకారులూ రాజ్యలక్ష్మి పురస్కారములను అందుకున్నారు. ఈ పురస్కారాన్నీ ఓ నోబుల్ పురస్కారంగా భావించి సంతృప్తిపడిన వారెందరోఉన్నారు! మంగళంపల్లి బాలమురళీకృష్ణ, వెంపటి చినసత్యం, ధ్వని సామ్రాట్ వేణుమాధవ్, వై నాయుడమ్మ, టంగుటూరి సూర్యకుమారి, బెజవాడ గోపాలరెడ్డి, సి. నారాయణరెడ్డి, ద్వారం వెంకటస్వామినాయుడు ట్రస్టు, లతా మంగేష్కర్, నట రాజ రామకృష్ణ, పి. సాయినాథ్, డా॥ పి. భానుమతి, చెన్న ఘంటమ్మ, నేదునూరి కృష్ణమూర్తి, సుధామూర్తి, బిరుదురాజు రామరాజు, ఏఎస్ రామన్, ఎస్వీ రామారావు, మల్లాది చంద్రశేఖరశాస్త్రి, మాండలిన్ శ్రీనివాస్, కోనేరు హంపి ప్రభృత ప్రముఖులతో బాటు శివాంశసంభూతులు, సద్గురువు కందుకూరి శివానందమూర్తి మహోదయు లుండడం పి.వి. రమణ్యరాజా పురాకృత పుణ్యం. ఇంకా వారి యితర ట్రస్టుల ద్వారా పురస్కారములు పొందిన మహానుభావులున్నారు.

రాజ్యలక్ష్మి అవార్డులతోబాటు లిటరరీ అవార్డు, లక్ష్మీరాజా వైదిక పురస్కారాన్ని కూడా జోడించారు. ఈ అవార్డులను ఆయన శ్రీమతి మహలక్ష్మి జన్మదినమైన ఆగస్టు 15న ప్రకటించి, రమణయ్య రాజా పుట్టినరోజైన నవంబర్ 19న ప్రదానం చేస్తూ వచ్చారు.



రమణయ్యరాజా రియల్ ఎసేట్ట్ వ్యాపారంకోసం విశాఖపట్నం వెళ్లిన తర్వాత నేను అంతగా చూడలేదు. భీమిలిలో సద్గురు శివానందమూర్తిగారి ఆనందవనం వెళ్ళినపుడు చూసాను. అక్కడే వారు నిర్మించుకున్న సౌధంలో ఉంటున్నట్లు చెప్పారు. వారి కుటుంబీకులందరికీ కందుకూరి శివానందమూర్తి మహోదయ గురువుల పట్ల అచంచలమైన భక్తి ఉన్నది. సద్గురు శివానందమూర్తి గారు శ్రీరామనవమి రోజున సికిందరాబాద్ తివోలీ గార్డెన్స్‌లో 11 మందికి రొఖ్ఖ పురస్కారములొసగేవారు. అక్కడ కూడా రెండు కార్యక్రమాల్లో కలిసాను. రాజా ట్రస్టు కార్యక్రమాలు శివానంద గురువులు చూస్తున్నారన్నారు. కానీ నేను భీమిలి ఆనందవనంలో దర్శించినప్పుడు కూడా రమణయ్యరాజా గారి సొంతవూరు భీమిలియని తెలియదు. ఆయన ఆగస్టు26న మద్రాసులో మరణించారని పిడుగువార్త విన్నప్పుడే తెలిసింది. 87 సంవత్సరముల వయసనీ అంత్యక్రియలు కూడా జరిగాయని తెలిసి అమితంగా బాధపడ్డాను.

ఆయన 1927 సం॥ము నవంబరు 19న భీమిలి ప్రక్కవూరిలో లో జన్మించారు. 23 ఏండ్లకే వ్యాపారం ప్రారంభించారు. ప్రారంభించిన 12 ఏళ్లకే మద్రాసు వచ్చారు. మద్రాసులో ఎంతోమంది వైశ్యులకన్నా రమణయ్యరాజా శుక్లపక్షపు చంద్రునిలా వర్థిల్లారు. శీతల చంద్రునిలా పలకరించేవారు. కలుపుగోలుతనం వారి చిరునామా. వారి వంశోద్ధారకులు వెంకట్రావు, పివి కృష్ణారావు డా॥ కాంతామణి వద్ద కూడా కలుపుగోలుతనం ఎక్కువ. ఆయన తన వ్యాపార పరిధుల్ని దాటి హిందూస్థాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగాను, మద్రాసు పోర్ట్ ట్రస్టు మెంబర్‌గాను, ఆంధ్రా యూనివర్శిటీ సెనేట్ మెంబరుగాను, కూచిపూడి ఆర్టు అకాడమీ, పొట్టి శ్రీరాములు మిషన్ ఉపాధ్యక్షులుగాను ఇలా ఎన్నో పదవులు నిర్వహించారు.

చెన్నయ్‌లోని ఆర్యవైశ్య కుటుంబాల్లో నలభై, యాభై దశకంలో వచ్చిన రమణయ్య రాజా మూడు దశాబ్దాల్లో మూడు శతాబ్ద చరిత్రను సృష్టించారు. ఈ శకపురుషునికి మా దీర్ఘ సంతాపం తెలుపుతున్నాం. ●



# పాలకొల్లు ప్రక్క పెనుగొండ పుడమి వైశ్యులకది పెనుకొండ!
# కన్యకా పరమేశ్వరి నడయాడింది ఇచ్చటే దేవతగా వెలసింది ఇచటే!

**కృతేసు రేణుకాదేవి త్రేతాయాం జనకాత్మజా**
**ద్వాపరే ద్రౌపదీ దేవీ కలౌ వాసవీ కన్యకా॥**

కృతయుగంలో రేణుకాదేవిగా, త్రేతాయుగంలో జనకుని కుమార్తెగా, ద్వాపర యుగంలో ద్రౌపదిగా, కలియుగంలో వాసవీ కన్యకాపరమేశ్వరిగా అవతరించిందా జగన్మాత. ధర్మానికి హాని జరిగినప్పుడు, ధర్మాన్ని రక్షించేందుకై ఏ యుగంలోనైనా పరమాత్ముని శక్తి ఏదో ఓ రూపంలో జన్మించి రక్షిస్తుంది.

పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిగాక, ఆ సందర్భంగా జరిగిన ఉత్సవంలో, నందీశ్వరుడు గొప్పగా నర్తించాడట. ఆ నాట్యం చూసి పరమేశ్వరుడు సంతోషించి నందీశ్వరుణ్ణి దీవించాడు.

దాంతో నందీశ్వరుడు భక్తిగా పరమేశ్వరి చుట్టూ ప్రదక్షిణాలు చేశాడు. పార్వతికి చేయలేదు. అందుకు పార్వతి కినుక వహించి శపించింది. "వెళ్ళి భూలోకంలో జన్మించ"మని. నందీశ్వరుడు గొప్ప తపశ్శాలి. "మాతా! నాతోపాటు నీవూ భూలోకంలో పుట్టుదువు గాక" అంటూ ప్రతి శాపమిచ్చాడు.

వైశ్యులలో కల 714 గోత్రికులు లక్ష్మీపుత్రులు. దానధర్మాలు, యజ్ఞయాగాలు చేసి, పుణ్యఫలంతో కైలాసానికి, వైకుంఠానికి చేరి శివకేశవ సేవ చేస్తున్నారు.

వైశ్యులంతా అలా కైలాసానికి, వైకుంఠానికి రావడంతో భూలోకంలో వ్యాపారాలు చేసేవారు. లేక దుర్భర దారిద్ర్య పరిస్థితులేర్పడ్డాయి. అ పరిస్థితిని గ్రహించిన పరమేశ్వరుడు, విష్ణువు, బ్రహ్మతో కలసి చర్చించి చివరికి ఓ నిర్ణయానికొచ్చాడు.

ఆర్యవైశ్యులలో 714 గోత్రికులను వ్యాపార వ్యవహారాలు నిర్వర్తించేందుకై భూలోకంలో దేవతల్ని జన్మింపచేసారు. అందులో 102 గోత్ర వైశ్యులను అగ్నిప్రవేశం ద్వారా తిరిగి మోక్షమిచ్చి కైలాసానికి తెచ్చే బాధ్యత పార్వతి తీసుకుంది. అలా భూలోకంలోని భక్తులను రక్షించేందుకై శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మించడం జరిగింది. ఆమెకు అన్నగా నందీశ్వరుడు 'విరూపాక్షుడు'గా జన్మించాడు.

విరుపాక్షుడు, వాసవీ కన్యకాపరమేశ్వరి ఇద్దరూ కవలలుగా జన్మించారు.

కుసుమశ్రేష్ఠి పెనుగొండ రాజు. వైశాఖ శుద్ధ దశమీ శుక్రవారం నాడు కుసుమ శ్రేష్ఠికి ఈ కవలలిద్దరూ జన్మించారు.

***తండ్రీ! పూర్వజన్మలో మీరు చేసిన పుణ్యకార్యముల ఫలితంగా పార్వతీదేవి అంశగా నేను మీకు కుమార్తెగా జన్మించాను. నేను బ్రహ్మచారిణిగానే ఈ జీవితాన్ని ముగించదలిచాను. కనుక రాజును చూసి మీరు ఎవ్వరూ భయపడవలసిన అవసరం లేదు. నేను అగ్నిగుండంలో ప్రవేశిస్తూవున్నాను. విష్ణువర్ధనుడి తల వేయి ముక్కలై... విచక్షణా జ్ఞానం కోల్పోయిన వారికి ఏ గతి వస్తుందో ఉదాహరణగా నిలుస్తాడు" అని పలికింది.***

బాల్యం నుంచే వాసవికి అమితభక్తి. నగరేశ్వస్వామికి పూజలు చేసేది.

ఇక ఆమె సోదరుడు విరూపాక్షుడు గొప్పగా శివతాండవం చేసేవాడు. అలా వారు ఎంతో ఆదర్శవంతంగా తండ్రి ఇంట పెరుగుతున్నారు.

తూర్పుగోదావరి తీరంలోని రాజమహేంద్ర వరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలిస్తున్నాడు విష్ణువర్ధన మహారాజు. ఆయనకెందరో భార్యలు. విష్ణువర్థన మహారాజు పెద్దకొడుకే రాజరాజ నరేంద్రుడు. ఆయన పెద్దమనమడే సారంగ ధరుడు.

ఓసారి ఈ విష్ణువర్ధనుడు చుట్టుపక్కల నున్న రాజ్యాలపై దండయాత్ర చేసి వస్తూ ఓ ఉద్యానవనంలో విడిది చేశాడు. ఆ సుందర ఉద్యానవనం ఆర్యవైశ్యరాజు కుసుమ శ్రేష్ఠిదని తెలుసుకున్నాడు.

తమ ఉద్యానవనంలో విష్ణువర్ధన మహారాజు విశ్రాంతికై విడిదిచేశాడని తెలిసి ఆయన దర్శనానికై కుసుమశ్రేష్ఠి వెళ్ళాడు. మందీ మార్బలంతో, విష్ణువర్ధన మహారాజుకు స్వాగతాంజలినిచ్చి యథాశక్తి గౌరవించి నగరంలోకి ఆహ్వానించారు.

నగరానికి వచ్చాక నగరేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నాడు విష్ణువర్ధనుడు. అక్కడున్న కన్యలంతా ఆయనకు హారతులిచ్చారు కానీ, వాసవీకన్యక మాత్రం ఆయనకి హారతి ఇవ్వకుండా నగరశ్వేరస్వామికి మాత్రమే హారతినిచ్చింది.

దేవతలా మెరిసిపోతున్న వాసవీకన్యకను చూసి మనసుపడ్డాడు విష్ణువర్ధనుడు. అక్కడున్న మంత్రి సామంతులకు తన మనసులోని మాట చెప్పాడు.

వారు వలదన్నారు. అందుకు వారిపై మండిపడ్డాడు విష్ణువర్ధనుడు. మేము కుసుమశ్రేష్ఠిని ఒప్పిస్తాం, మీరు వెళ్ళండని నచ్చచెప్పి పంపించారు. ఆ తరువాత విష్ణువర్ధనుడు వాసవీకన్యకపట్ల మనసుపారేసుకున్న వైనం చెప్పి, ఆమెను వివాహానికి ఒప్పించమని సామదానభేద దండోపాయాలతో బెదిరించారు.

కుసుమశ్రేష్ఠి లొంగలేదు. వైశ్యులంతా హాజరై ఓ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. విషయాన్ని వివరించారు.

అప్పుడు వాసవీకన్యక ఇలా అంది– "నేను నగరేశ్వరస్వామి అర్ధాంగిని. కామాంధుడైన విష్ణువర్ధనుడి దృష్టి తగిలిన ఈ శరీరాన్ని విసర్జిస్తాను. ఆ రాజుని శాపగ్రస్తుడిని చేసి, నేను అగ్నిప్రవేశం చేస్తాను" అంటూ వుండగా ఆకాశంలో రకరకాలైన ధ్వనులు వినబడ్డాయి.

చూస్తూవుండగానే వాసవీకన్యక శరీరం క్రమేపీ పెరగసాగింది. సహస్రతలలు, సహస్రబాహువులతో ఆకాశమే శిరస్సుగా, సూర్యచంద్రులే నేత్రాలుగా, దిక్కులే చెవులుగా, వేదాలే ఆమె మాటలుగా, ఉపనిషత్తులు పాదాలుగా దర్శనమిచ్చాయి. వైశ్యశ్రేష్ఠులంతా ఆమె విశ్వారూపం చూసి మోకరిల్లి జయజయధ్వానాలు చేశారు.

శాంతించిన వాసవీకన్యక అగ్నిప్రవేశం చేసింది. ఆమెతోపాటు గోత్రానికి ఓ వృద్ధ జంటచొప్పున 102 మంది గోత్రీకులు అగ్నిప్రవేశం చేశారు. వారందరికీ మోక్షానిచ్చింది వాసవీకన్యకపరమేశ్వరి. ఇది జరిగినరోజే విష్ణువర్ధనుడు తల పగిలి మరణించాడు. ఆ రోజు నుండి వాసవీ కన్యక జగన్మాతగా ఆర్యవైశ్యుల ఇలవేల్పుగా ఆరాధనీయురాలైంది.

అగ్నిప్రవేశం చేసినచోట వాసవీ కన్యక శిలారూపం ధరించి నేటికీ వుంది. కోరినకోరికలను తీర్చే తల్లిగా వాసవీకన్యకా పరమేశ్వరి ప్రసిద్ధిచెందింది. ●

# ఆత్మీయులు, హితులు, స్నేహితులు, తెలుగు భాషాభిమానుల మధ్య వేడుకగా జరిగిన శ్రీ గోటేటి శ్రీరామారావుగారి సహస్రపూర్ణ చంద్రదర్శన సభ

- గోటేటి వెంకటేశ్వరరావు -

గురుపూర్ణిమ అయిన రెండు రోజులకు అంటే ఆగస్ట్ 2న నాన్నగారి సహస్రపూర్ణ చంద్ర దర్శనం చెయ్యాలని ముగ్గురన్నదమ్ములం నిర్ణయించుకున్నాం. ఆయన నాకు నాన్నే కాదు గురువు కూడా. ఇదివరలో నేను ప్రస్తావించినట్లుగా ముగ్గురు కొడుకులలో నేను ఆయనతోనే వుండిపోయాను. పత్రికలు, సినిమా, ప్రెస్ వ్యాపారాలు చూసుకుంటూ వుండేవాడిని. ఆయన సరిహద్దులోని సైనికుడి వంటి వారు ఎప్పుడూ జీవితంలో పోరాటమే. ఎన్నో ఒడిదుడుకులు అయినా ఎప్పుడు ఎక్కడా చతికిలపడలేదు. నాకు తెలిసి సినిమా వ్యాపారం బాగా దెబ్బతీసింది. అప్పులూబీల్లో, ఏం చెయ్యాలో పాలుపోని పరిస్థితి అయినా ఆయన మనో ధైర్యం చెక్కుచెదరలేదు. మనిషి బెదరలేదు. దాని నుంచి చాకచక్యంగా బయటికి వచ్చారు. 'పుట్టటం కాదు పుట్టి ఏదన్నా సాధించాలి' అన్నది ఆయన సిద్ధాంతం. 13 ఏళ్లకే వ్రాత పత్రిక ప్రారంభించి 83 యేళ్లకు అదే వ్రాతలో అగ్రశ్రేణి ఆదర్శ పాత్రికేయునిగా కొనియాడబడ్డారు.

ఆగస్టు రెండు ఆదివారంనాడు 6.15 నిమిషాలకు అనుకున్న సభ అనుకున్న సమయానికి సరిగ్గా ప్రారంభించాం. కొన్ని సభలలో చిన్న చిన్న ప్రసంగాలు చేసినా ఒక పూర్తిస్థాయి సభలో వేదికమీద హేమాహేమీలయిన అతిథులున్నా వ్యాఖ్యాతగా నేనే వుండాలని పట్టుదలతో నాన్నగారి గురించి బాగా తెలిసున్నవాడిగా చిన్న చిన్న విశేషాలతో సభను నడిపిద్దామని ఉదేశ్యంతో నేనే వ్యాఖ్యాతగా సభను ప్రారంభించాను. ముందు గోటేటి శ్రేయ, గోటేటి అంజనల ప్రార్థన తరువాత, అబ్దుల్ కలాం గారికి శ్రద్ధాంజలి ఘటించాం. నా స్నేహితుడు సంజయ్ గుండ్ల నాపై అభిమానంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాన్నగారి జీవితంలోని ముఖ్య ఘట్టాలతో 7 నిమిషాల లఘుచిత్రాన్ని (ఆడియో విజువల్) ప్రదర్శించారు. ఆ విషయం నాన్నగారికి కానీ, మా ఇంటిలోనివారికి కానీ ఎవరికి తెలియదు. అదే సర్‌ప్రైజ్.

**ఇక ఈ సభకు మేమెన్నుకున్న అతిథులు:**

శ్రీమండలి బుద్ధ ప్రసాద్‌గారు, ఉపసభాపతి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, తెలుగు రాజకీయ నాయకులలో తెలుగులో అనర్ఘళంగా మాట్లాడగలిగిన వ్యక్తి, సౌమ్యుడు అంతేకాక వారి తండ్రిగారయిన శ్రీమండలి వెంకటకృష్ణారావుగారు నాన్నగారికి సన్నిహితులు. వారి ఆధ్వర్యాన జరిగిన మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలు మా నాన్నగారు పాల్గొనడం, ఆ రీత్యా ఇప్పుడు ఆయన ముఖ్య అతిథిగా వస్తే బాగుంటుందని ఆయనను కోరడం, ఆయన అంగీకరించడం, మాకు మహదానందాన్ని కలిగించింది. రెండవ గౌరవ అతిథి శ్రీమతి వి.ఎల్.ఇందిరా దత్‌గారు అధ్యక్షులు, ప్రపంచ తెలుగు సమాఖ్య, మా ప్రముఖాంధ్ర మొట్టమొదటి సంచిక ప్రపంచ తెలుగు సమాఖ్య నిర్వహించిన ప్రపంచ తెలుగు మహా సభలలోనే విడుదలయ్యింది. ఆ రీత్యా మేము కోరడం ఆవిడ అంగీకరించడం జరిగింది. కాని కొన్ని అనివార్య కారణాల వల్ల ఆవిడ రాలేకపోయినా ప్రపంచ తెలుగు సమాఖ్య కోశాధికారి డాక్టర్ శివరామప్రసాద్‌గారు రావడం, అధ్యక్షుల సందేశాన్ని వినిపిం చారు. ఇంకొక అతిథి ప్రొఫెసర్ సి.ఎమ్.కె. రెడ్డి మా నాన్నగారు ఏ సభ నిర్వహించినా ఆ సభను ఆయనే ముందుండి నడిపిస్తారు. మా కుటుంబానికి అత్యంత ఆత్మీయులు! అంతేగాక ప్రముఖాంధ్ర ప్రారంభానికి ముందు ఆ పత్రిక పతాకస్థాయికి వెడుతుందని శుభాకాంక్షలు అందించినవారు. మరో విశిష్ట అతిథి శ్రీ నల్లికుప్పుసామి చెట్టి నాన్నగారి మీద ఎనలేని ప్రేమ, కట్టలు తెంచుకునే అభిమానం మా సభకే కాకుండా ముందురోజు మా తమ్ముడు సాయిప్రసాద్ భార్య కూతురు కూచిపూడి రంగ ప్రవేశానికి ఆయనముఖ్య అతిథి. ఎక్కడో తిరువనంతపురం వెళ్లవలసిన ఆయన ఆ ప్రోగ్రాంను కేన్సిల్ చేసుకుని నాన్నగారిపై ప్రేమతో ఈ రెండు సభలకు వచ్చారు. ఇక పి.ఎస్. ప్రకాశరావుగారు చీఫ్ జనరల్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పరిచయం చాల తక్కువ అయినప్పటికి ఆయన తెలుగు భాషాభిమానంతో నాన్నగారిపై గౌరవం మెండు. అచ్చంగా తెలుగుమాట్లాడే ఆఫీసరు ఆ రీత్యా ఆయనను కోరడం ఆయన అంగీకరించడం జరిగింది. వీరందరి పరిచయ కార్యక్రమం అయ్యాక అతిథులందరిని మా తమ్ముళ్ళిద్దరు గోటేటి నారాయణరావు, సాయిప్రసాద్‌లు మన తెలుగు సంప్రదాయం ప్రకారం పట్టుశాలువ, పండ్లు, జ్ఞాపికలతో సత్కరించారు. మొట్టమొదటగా శ్రీనల్లి కుప్పుసామి చెట్టిగారు తనదైన శైలిలో భారతియార్ వర్ణించిన సుందర తెలుగులో మాట్లాడారు. నాన్నగారితో ఆయనకున్న అనుబంధాన్ని, మొత్తం సినిమా పరిశ్రమ అంతా వెళ్లిపోయినా ఇక్కడే వుండి తెలుగు భాషకి సేవ చేస్తున్న ఆయనంటే తమకు గౌరవమని చెప్పారు. నాన్నగారికి ప్రత్యేకంగా బంగారు కంకణం, పట్టు వస్త్రాలతో సత్కరించారు. శ్రీ సి.యమ్.కె. రెడ్డిగారు తనకు 1975 కళాసాగర్ ప్రారంభం నుండి గోటేటి గారితో పరిచయమని ఆయన మంచితనంతో అందరినీ ఆకట్టుకున్నారనీ, ప్రముఖాంధ్ర ద్వారా ప్రపంచ దేశాలన్నీ తిరిగి తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటించారని తెలిపారు. శ్రీశివరామప్రసాద్‌గారు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు సమాఖ్యలో కార్యవర్గసభ్యునిగా ఆయనతో పరిచయమని, పెద్దవారిగా అనుభవశాలిగా ఎన్నో సూచనలు చేసేవారని చెపుతూ ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షులు శ్రీమతి వీఎల్ ఇందిరాదత్ గారి సందేశాన్ని చదివి వినిపించారు. శ్రీ పిఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ తనకు ఆయనతో పరిచయం ఈ మధ్యకాలంలోనే అయినా ఈ ప్రస్తుత ఈమెయిల్, మొబైల్ యుగంలో ఆయన చక్కటి తెలుగులో ఒక ఉత్తరం రాశారని అది తనని ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. మనిషి జీవితంలో చాలా అరుదుగా జరిగే సహస్రపూర్ణ చంద్ర దర్శనం శ్రీ గోటేటిగారికి జరగటం చాలా విశేషమని ఆయన ఇంకా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆశిస్తున్నానన్నారు. ఈసభకు, ముందురోజు కూచిపూడి రంగప్రవేశానికి ప్రత్యేకంగా హైదరాబాద్ నుండి శ్రీమతి ప్రభా రమేష్ వచ్చి పాల్గొన్నారు. నాన్నగారికి బంగారు ఉంగరాన్ని బహూకరిస్తూ ఆయన తనకు పితృసమానులని ఆయన కోసమే తను ప్రత్యేకంగా వచ్చానన్నారు. ఇక చక్కని తెలుగులో గౌరవనీయులు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఉపసభాపతి శ్రీమండలి బుద్ధ ప్రసాద్‌గారి ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. అందులోని కొన్ని అమృతగుళికలు.


**పాత్రికేయ రంగానికి మార్గదర్శి గోటేటి..**

సమాజశ్రేయస్సే లక్ష్యంగా చేసుకుని దాదాపు 60 సంవత్సరాలుగా 'ఆదర్శ పాత్రికేయుడి'గా జీవితాన్ని సార్థకం చేసుకున్న గోటేటి ధన్యజీవి అని కొనియాడారు. ఎవరైనా తప్పుచేసినా సున్నితంగా మందలించే అరుదైన వ్యక్తియని, భారతదేశంలో ఉన్న ప్రతి ఆధ్యాత్మిక పీఠం, ఆధ్యాత్మిక గురువు ఆశీస్సులు పొందిన వ్యక్తిగా అభివర్ణించారు. 13 ఏళ్ల ప్రాయంలో రచనా వ్యాసంగాన్ని ప్రారంభించి 83 ఏళ్ల వయస్సులోనూ కొనసాగిస్తూ, ఎన్నో సత్కారాలు, బిరుదులు అందుకున్న గోటేటి తమిళనాట స్థిరపడి తెలుగు భాషకు చేస్తున్న కృషి, చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వ్యక్తిగా ఆయన హృదయం గొప్పది కాబట్టి ఆయన అభిమానులకు ఈ హాలు చాలలేదనీ చెప్పారు. ఎల్లో జర్నలిజం జోలికి పోకుండా తెలుగు భాషని చెప్పదలచుకున్న అంశానికి సున్నితంగా చురకలంటించడం ఆయన శైలియని అన్నారు.

టిటిడి స్థానిక సలహామండలి అధ్యక్షులు శ్రీ ఆనందకుమార్‌రెడ్డిగారు, శ్రీకృష్ణారావు, శ్రీ నారాయణగుప్తా, అర్చకుల వేదమంత్రాలతో ఆశీర్వాదంతో స్వామివారి ప్రసాదాన్ని అందించారు. అలాగే మైలపూరు ఆలిండియా సాయి సమాజ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. తంగరాజు, అర్చకులతో వచ్చి తలపాగా చుట్టి సాయిబాబా మాలను ప్రసాదాన్ని అందించారు. నాన్నగారికి అత్యంత ఆత్మీయులూ తిరుమలలోని 'వుడ్ సైడ్' అధినేతయైన కృష్ణభట్ సతీసమేతంగా సత్కరించడం ముదావహం.

**కురిసిన కవితామృత వర్షధారలు...**

సభకు విచ్చేసిన ముఖ్య అతిథుల ప్రసంగాల తరువాత శ్రీభువనచంద్రగారు గోటేటిపై తన కవితాఝురిలో ఓలలాడించారు. గోటేటి **(తరువాయి 26వ పేజీలో)**



ఓరుగల్లులో గణపతి రుద్రదేవునికి మహాభారతాన్ని వినిపిస్తున్న తిక్కన సోమయాజి

# కవిత్రయంలో తిక్కనగారిదొక ప్రత్యేక బాణీ! కలమే ఖడ్గమూ! ఖడ్గమే కలమూ! ప్రత్యేకశైలికి ఆద్యుడు!

వింటే భారతం వినాలి – అన్నారు. 'ఆంధ్ర మహాభారతం' చదువరులను అంతగా అలరించడానికి ప్రధానంగా చెప్పుకోవలసిన కవిత్రయం. కవిత్రయంగా తెలుగు వాఙ్మయంలో చెప్పుకోదగిన కవులు నన్నయ, తిక్కన, ఎర్రనగారలు. వీరు ముగ్గురూ మూడు కాలములవారు! అయినప్పటికినా, ఇతిహాస స్ఫుటీకరణంలో కథ కొనసాగింపులో – మూల కథకు విఘాతము లేకుండా అమోఘంగా, అమేయంగా, అద్వితీయంగా అసమాన ప్రజ్ఞాగరిమతో తీర్చిదిద్దారు. సంస్కృతాంధ్రము లెరిగిన సాహితీ సామ్రాట్లు – మూలానికి చక్కగా కస్తూరీ తిలకములు దిద్దినారని యావత్సాహితీపరులు ప్రశంసించారు.

కవులలో అసమాన్య ప్రతిభావంతుడూ, తనకుగా ఒక శైలికి శిల్పియైనవాడు కవి తిక్కన' అంటూ కీర్తింపబడ్డాడు. యజ్ఞము జేసి సోమయాజి అయ్యాడు.

ఆంధ్రుల సుప్రసిద్ధ రాజధానీ నగరమూ, కళాసాహితీ రంగాల కాలవాలమైన ఓరుగల్లు (ఇప్పటి వరంగల్)లో చక్రవర్తి గణపతి రుద్రదేవునికి మహాభారతాన్ని వినిపిస్తున్న తిక్కన సోమయాజి గార్ని సచిత్రంగా చూపే అదృష్టం కల్పించిన పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారికి మా కృతజ్ఞతలు.

---

**(25వ పేజీ తరువాయి)** బావమరిది శ్రీ తురగా సుందర శ్రీరామచంద్రమూర్తి తిరుపతి నుండీ శ్రీ సి.ఆర్.కె. శేషగిరిరావు, సన్మానపత్రమును అందంగా తయారించి, వారి ధర్మపత్ని అక్కరాజు శమంతకమణి (రచయిత్రి, నాన్నగారి అభిమానులు) వస్త్రాలతో నాన్నగారిని గౌరవించడానికి వచ్చారు. రాత్రి 9.30 గం॥ల వరకూ ఉండి – ఆనందం వ్యక్తీకరించడం, వారితో వచ్చిన విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీ జె.కృష్ణమూర్తిగారు ఆంధ్రీకరించిన 'మహాద్భుతం – మహాభారతం, 3 సంపుటాలు బహూకరించడంతో బాటు వారి శుభాభివందనము లందజేశారు. శ్రీ ప్రకాశరావు గారు, నాన్నగారిపై అభిమానంతో ఆయనపై కవితా కుసుమాలను మాలగా కూర్చి తీసుకొచ్చి వినిపించారు. అలాగే నాన్నగారి చిరకాల మిత్రులు శ్రీమనోహర్‌చెట్టిగారు ప్రత్యేకంగా రూపాయి నోట్లుతో కిరీటాన్ని, మాలను కూర్చివేసి అభినందించారు. నాదెళ్ళ ప్రసన్నకుమార్ గారు వేంకటేశ్వరస్వామి ఉంగరాన్ని, ఎం.కిషోర్‌గుప్త గారు పట్టుబట్టలు, 8 గ్రాముల బంగారు డాలర్నూ బహూకరించారు. అలాగే మాకు, మా కుటుంబానికి హితులు, స్నేహితులు, చుట్టాలు సుదూర ప్రాంతాల నుండి వచ్చారు.

ప్రముఖాంధ్రను ప్రోత్సహిస్తున్న వదాన్యులకు మా ముగ్గురు అన్నదమ్ములం పట్టుశాలువలతో జ్ఞాపికలతో సత్కరించాం.

ప్రముఖాంధ్ర ఇన్ని సంవత్సరాలు నిరాటంకంగా రావడానికి కారణమైనవారు ప్రత్యక్షంగా పరోక్షంగా ఎందరో ఉన్నారు. ఆ రోజు సభకు వచ్చినవారిలో శ్రీ ఉమ్మిడి సుధాకర్ శ్రీమతి లలిత, అజంతా వక్కపొడి శ్రీ శంకరరావు దంపతులు, శ్రీ కోదండరామన్, వివేక్ లిమిటెడ్, శ్రీహరికృష్ణ, గోపురం కుంకుం, శ్రీ ప్రసన్న కుమార్, నాదెళ్ల జ్యువెలరీ, శ్రీకిషోర్‌గుప్తా, గుప్తా ఎంటర్‌ప్రైజెస్, శ్రీ నారాయణ గుప్తా దంపతులు, శ్రీ విద్వాన్ ఎన్. దశరథరామిరెడ్డిగార్లను సముచిత రీతిన సత్కరించాం. సభనేత్రానందంగా, కన్నులపండుగగా నేను అనుకున్న దానికన్నా చాలా బాగా జరిగింది. వీటన్నింటికీ కారణం తెలుగు భాషామతల్లికి నాన్నగారు చేసిన సేవే కారణం. మంచితనం కారణం. తెలుగుజాతి, తెలుగుభాష, తెలుగు సంస్కృతికి గత 22 సంవత్సరాలుగా ప్రముఖాంధ్ర ద్వారా చేస్తున్న సేవను గుర్తించి గోటేటి అభిమానుల శ్రేయోగాముల అభిమాన ధనం ఉప్పొంగించిన తెలుగు తల్లి హృదయం ఎంత కరుణాపూరితమో!

నాకు ఇక్కడ కబీర్‌దాస్‌గారి కవిత గుర్తుకొస్తోంది.

**గంగాయ సోయేకర్ దివస్ గంగాయా భాయ్**
**హీరాజనమ్ అనమోల్ కౌడీ బదలే జాయ్**

'రాత్రంతా నిద్రలోను, పగలంతా తినడంతోను అయిపోతున్నది. వజ్రం లాంటి మానవ జన్మను గవ్వలా భావిస్తూ బ్రతుకుతున్నావు అని అంటాడాయన. నిజమే ఎంతమంది నిస్వార్థంగా ఇలా కష్టించి పేరుతెచ్చుకుంటారు. తెచ్చుకున్న పేరుని నిలుపుకోడానికి మళ్లీ ఎంత కష్టపడతారు! అందుకే కష్టేఫలి కృషే ఋషి అన్నారు. ఆయన మానవజన్మ ఎత్తినందుకు శ్రమించారు; సాధించి చూపారు. అందులో సగం అందుకున్నా మేము గొప్పవారమే! ●

**DASPALLA HOTELS LIMITED**
28-2-48, Suryabagh, VISAKHAPATNAM-530 020
Ph: 0891-2564825 (6 Lines) Fax : 0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com / hoteldaspalla@gmail.com

**DASPALLA RESORTS LIMITED**
Near Raghavendra Swamy Temple,
Waltair Main Road, VISAKHAPATNAM-530 002
Ph : 0891 - 2717300-305, 6512555-56
Fax: 0891-2717444, Cell : 9848098299 / 9866319737
E-mail : decvizag1@rediffmail.com

**DASPALLA RESORTS LIMITED**
Seetapathirao Road, 20-6-5, KAKINADA
Ph : 0884-2377301, 9866319733
E-mail : jayakkd@rediffmail.com

**JUBLEE HILL RESORTS LIMITED**
Road No. : 37, Jublee Hills, Hyderabad-500 033.
Ph : 040-23547214, Fax : 040 - 23547213
E-mail : contact@daspallahyderabad.com

**Web : www.daspallahotels.com**
**Call National Toll Free No. : 1800-425-4225**

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
September 2015

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97